క్లుప్తంగా

వేగంగా చెరువు గండి మరమ్మతు పనులు


చెరువు గండికి మరమ్మతు పనులు చేస్తున్న దృశ్యం

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం మల్కాపురంలో ఏలూరు నగర ప్రజలకు సరఫరా చేసే తాగునీరు చెరువుకు గండిపడిన విషయం విదితమే. ఏలూరు ఎమ్మెల్యే బడేటి చంటి, నగర మేయర్ నూర్జహాన్ పెదబాబు ఆధ్వర్యంలో గట్టు మరమ్మతుల పనులు వేగవంతంగా నిర్వహిస్తున్నారు.

హైస్కూల్లో చేరిన 11 మంది

దెందులూరు: విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలంటూ ఏలూరు రూరల్ మండలం లింగారావు, మాదేపల్లి హైస్కూల్ ఉపాధ్యాయులు పువ్వుల ఆంజనేయులు, నారాయణ శివశంకర్ ప్రచారం నిర్వహించారు. విద్యార్థులు తల్లిదండ్రులతో మాట్లాడారు. ఐదో తరగతి ఉత్తీర్ణత చెందిన 11 మంది విద్యార్థులను మాదేపల్లి హైస్కూల్లో బుధవారం చేర్పించారు.

మాదిగల అభివృద్ధికి కృషి

ఏలూరు (టూటౌన్): మాదిగల సంక్షేమం, అభివృద్ధికి కృషి చేయనున్నట్లు ఏపీ మాదిగ సంక్షేమ సహకార సంస్థ లిమిటెడ్ చైర్‌పర్సన్ ఉండవల్లి శ్రీదేవి తెలిపారు. స్థానిక ఎస్సీ కార్పొరేషన్ కార్యాలయంలో బుధవారం ఆమె విలేకర్లతో మాట్లాడారు. ఎన్డీఏ ప్రభుత్వం మాదిగల అభివృద్ధికి కట్టుబడి ఉందన్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ స్ఫూర్తితో ఎస్సీల కోసం ప్రభుత్వం 28 సంక్షేమ పథకాలను తిరిగి ప్రారంభించనున్నట్టు చెప్పారు. దళితులను ఏ, బీ, సీ, డీ వర్గీకరణ చేసి ఎన్నో ఉద్యోగాలు కల్పించిన ఘనత సీఎం చంద్రబాబు నాయుడుకు దక్కుతుందన్నారు. ఉభయ జిల్లాలకు తొలివిడతగా 1740 యూనిట్లకు రూ.58.60 కోట్లు మంజూరయ్యాయని వివరించారు. కార్యక్రమంలో ఎస్సీ సొసైటీ జిల్లాకార్యనిర్వాహక సంచాలకులు ఎం ముక్కంటి, నాయకులు పాలిమేర హరికృష్ణ, మార్లపూడి పాల్ రాజు, బయ్యారపు రాజేశ్వర రావు, కొమ్ముల రాజేష్, జుంజి మోజెస్, శ్రీరామరమేష్, మహిళా నాయకులు, జిల్లా ఎస్సీ సొసైటీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

విదేశీ విద్యా పథకం అమలుపై చర్యలు

ఏలూరు (టూటౌన్): విదేశీ విద్యా పథకం అమలుపై చర్యలు తీసుకోనున్నట్టు కాపు కార్పొరేషన్ చైర్మన్ కొత్తపల్లి సుబ్బరాయుడు తెలిపారు. జిల్లా పర్యటనలో భాగంగా బుధవారం ఆయన ఏలూరు విచ్చేశారు. జిల్లాలో కాపు కార్పొరేషన్ ద్వారా అమలవుతున్న చంద్రన్న స్వయం ఉపాధి రుణాలు, ఎంఎస్ఎంఈ రుణాలు, మహిళలకు కాపు కార్పొరేషన్ ద్వారా కుట్టు మెషీన్ ట్రైనింగ్ వంటి పథకాల అమలుపై జిల్లా ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్, బీసీ / కాపు కార్పొరేషన్ ఎన్ పుష్పలతతో సమీక్షించారు.

నిబంధనలు బేఖాతరు

- రోడ్డు, గుడి, స్కూలు పక్కనే మద్యం షాపులు
- ఇబ్బందులు పడుతున్న ప్రజలు
- రెచ్చిపోతున్న మందు బాబులు
- చోద్యం చూస్తున్న అధికారులు

ఏలూరు (టూటౌన్): మద్యం షాపుల ఏర్పాటు విషయంలో పాటదారులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. గుడి, బడి, రద్దీ ప్రదేశాల్లో 100 మీటర్ల దూరంలో మద్యం దుకాణాలు ఏర్పాటు చేయాలనే నిబంధన ఉన్నప్పటికీ అమలు కావడంలేదు. ఏలూరు వన్‌టౌన్ ప్రాంతంలోని ఒక సినిమా హాలు పక్కనే మద్యం దుకాణాన్ని ఏర్పాటుచేయడంతో సినిమాకి వచ్చిపోయే మహిళలు, యువతులు ఇబ్బందులు ఎదుర్కొటున్నారు. టూటౌన్ ప్రాంతంలోని పవరుపేట రైల్వే స్టేషన్ ఎదురుగా మెయిన్ రోడ్డుకు పక్కగా మద్యం దుకాణం ఏర్పాటు చేయడంతో రైల్వే ప్రయాణికులు, వాహనచోదకులు అవస్థలు పడుతున్నారు. నిబంధనల అమలు చేయాల్సిన ఎక్సైజ్ అధికారులు పట్టీపనట్లు వ్యవహరిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి.

మద్యాంధ్రప్రదేశ్‌గా చేసేశారు

కూటమి ప్రభుత్వం లక్ష్యం స్వర్ణాంధ్ర ప్రదేశ్ అని చెబుతున్నా చేతల్లో మద్యాంధ్రప్రదేశ్ చేశారని ఏలూరు నగర ప్రజలు ఆరోపిస్తున్నారు. విచ్చలవిడిగా మద్యం షాపులు ప్రైవేటు వ్యక్తులకు కట్టబెట్టడంతో పాటు నిబంధనలకు విరుద్ధంగా మద్యం అమ్మకాలు చేస్తున్నారు. మద్యం ప్రియులు పగలు సైతం పూటుగా మందు తాగి ఎటెళ్లాలో తెలియని మైకంలో ఇళ్లు, షాపుల ముందు, రోడ్డుపైనా, ఖాళీ ప్రదేశాలు, పార్కుల్లో ఎక్కడి పడితే అక్కడ పడి దొర్లుతున్నారు. దీంతో ఆయా కుటుంబాల వారు ఆవేదన, ఆక్రందన చెందుతున్నా పట్టించుకునే వారు కరువైపోయారు. పదుల సంఖ్యలో మందు షాపులు, వీటికి తోడు అనధికారంగా నిర్వహించే బెల్టు షాపుల వల్ల నిత్యం యువత వేళాపాళా లేకుండా మద్యం మత్తులో జోగుతున్నారు. దీంతో యువత పెద్ద సంఖ్యలో పెడతోవ పడుతున్నారంటూ నగర వాసులు వాపోతున్నారు.


వన్‌టౌన్‌లో ఓ థియేటర్ పక్కనే ఉన్న మద్యం షాపు


పవరుపేట రైల్వే స్టేషన్ ఎదురుగా రోడ్డు పక్కనే ఉన్న మద్యం షాపు


థియేటర్ సమీపంలో ఓఇంటి ముందు ఇలా..


మద్యం మత్తులో ఓ ఇంటి ముందు నిద్రిస్తున్న వ్యక్తి

గత ప్రభుత్వంలో ఇలా..

వైఎస్సార్ సీపీ హయాంలో మద్యం షాపులను నేరుగా ప్రభుత్వమే నిర్వహించింది. ఉదయం 11 నుంచి సాయంత్రం 9 గంటల వరకే మద్యం విక్రయాలు చేశారు. ఎక్కడా బెల్టు షాపులు లేకుండా చేశారు. ఇందుకు భిన్నంగా కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టాక మద్యం విక్రయాలను ప్రైవేటు వ్యక్తులకు అప్పగించడంతో సీను రివర్సయింది.

సందు సందులో బెల్ట్ షాపులు

బెల్టు షాపులు నిర్వహిస్తే తాట తీస్తాం, జరిమానా విధిస్తాం, శిక్షలు వేస్తాం అని పైకి ప్రభుత్వ పెద్దలు చెబుతున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో విచ్చలవిడిగా మద్యం, బెల్టు షాపులు దర్శనమిస్తున్నాయి. ప్రభుత్వ పెద్దల అండదండలతో చోటా మోటా నాయకులు వీటిని విచ్చలవిడిగా నిర్వహించేస్తున్నారు. వీటి వైపు కన్నెత్తి చూసేందుకు సైతం ఎక్సైజ్ శాఖ అధికారులు జంకుతున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. అమాయకులు దొరికితే వారిని అదుపులోకి తీసుకుని కేసులు కట్టి వేధిస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి.

పెడతోవ పడుతున్న యువత

విచ్చలవిడిగా మద్యం విక్రయాల కారణంగా నగరంలోని యువత పెద్ద ఎత్తున మద్యానికి బానిసైపోతున్నారు. ఒక్కోసారి డబ్బుల కోసం అసాంఘిక కార్యక్రమాలకు సైతం యువత వెనుకాడటం లేదని మహిళా సంఘాల నాయకులు చెబుతున్నారు. గతంలో రోడ్డుకు 200 మీటర్ల దూరంగా మద్యం షాపును నిర్వహించే వారని, తాజాగా గుడి, బడి అనే తేడా లేకుండా ప్రధాన రోడ్లను ఆనుకుని మద్యం షాపులు ఏర్పాటు చేసేశారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీంతో ఒక్కో సమయంలో రోడ్ల వెంబడి వెళ్లే వాహనచోదకులు, ప్రజలు, ముఖ్యంగా మహిళలు అనేక ఇబ్బందులు పడుతున్నారు.

బెల్టు షాపులను అరికట్టాలి



ఏలూరు నగరంలో విచ్చల విడిగా నిర్వహిస్తున్న మద్యం అమ్మకాలను నిరోధించాలి. బెల్టు షాపులను పూర్తిగా అరికట్టాలి. గతంలో మచ్చుకైనా కన్పించని బెల్టు షాపులు నేడు ప్రతి వీధిలో, సందులో దర్శనమిస్తున్నాయి. అధికార పార్టీలకు చెందిన ప్రజాప్రతినిధులే బెల్టు షాపులకు ఊతమిచ్చే విధంగా సహకరిస్తున్నారు. ఇటీవల అసాంఘిక కార్యకలాపాలు పెరిగి పోవడానికి మద్యం విచ్చలవిడి అమ్మకాలే కారణం. – ఎ.రాణి, ఐద్వా జిల్లా కార్యదర్శి, ఏలూరు

జనావాసాలకు దూరంగా ఉండాలి



మద్యం దుకాణాలు జనావాసాలకు దూరంగా ఉండేలా చూడాలి. ఏలూరు నగరం పరిధిలో మద్యం షాపుల ఏర్పాటు, బెల్టు షాపుల నిర్వహణకు వ్యతిరేకంగా ఎన్ని ఆందోళనలు చేపట్టినా అధికారులు, ప్రజాప్రతినిధులు పట్టించుకోవడం లేదు. ఉన్నతాధికారులకు సైతం వీటికి వ్యతిరేకంగా వినతి పత్రాలు అందజేశాం. మహిళలు, బాలికలపై అత్యాచారాలు పెరిగి పోవడానికి విచ్చలవిడిగా మద్యం అమ్మకాలే కారణం. – జి.శారద, మహిళా సంఘం నాయకులు ,ఏలూరు

జాతరలో విద్యుత్ అలంకరణలు


జాలిపూడిలో విద్యుత్ దీపాలంకరణలు

దెందులూరు: ఏలూరు రూరల్ మండలం జాలిపూడి గ్రామంలో శ్రీ గంగానమ్మవార్ల జాతర అంగరంగ భక్తిశ్రద్ధలతో నిర్వహిస్తున్నారు. నిర్వాహకులు గ్రామదాత దీపక్ నెక్స్‌జెన్ అధినేత సుబ్రమణ్యం, మున్న, సాంబశివరావు గ్రామస్తుల ఆర్థిక సాయంతో శ్రీ గంగానమ్మవార్లకు శ్రీ సీతారామాంజనేయ లక్ష్మణ చిత్రాలకు వివిధ రంగుల విద్యుత్ బల్బులతో అలంకరించారు. కిలో మీటరు మేర రోడ్డుకి ఇరువైపులా కర్రలకు విద్యుత్ లైట్లు ఏర్పాటు చేసి శోభయమానంగా తీర్చిదిద్దారు. గ్రామ అభివృద్ధి కమిటీ చైర్మన్ గ్రామ మాజీ సర్పంచ్ దాసరి నాగమల్లేశ్వరి బుజ్జి దంపతులతో పాటు ఆలయ కమిటీ సభ్యులు పంచాయతీ వార్డు మెంబర్లు, గ్రామస్తులు గణాచార్యులు, అమ్మవార్లను దర్శించుకుని పూజలు చేశారు.

వ్యక్తి అదృశ్యం

టి.నరసాపురం: కామవరపుకోటకు చెందిన మోదుగుమూడి నాగరాజు (35) అదృశ్యంపై కేసు నమోదు చేశామని ఎస్సై ఎం.జయబాబు బుధవారం తెలిపారు. నాగరాజు ఈ నెల 20న రాత్రి టి.నరసాపురం తన చిన్నమామ కందిమళ్ల సత్యనారాయణ ఇంటికి వచ్చి తిరిగి బయలుదేరి కామవరపుకోటకు వెళ్లలేదన్నారు. ఈ మేరకు ఈ నెల 22న స్థానిక పోలీసు స్టేషన్‌లో కందిమళ్ల సత్యనారాయణ ఫిర్యాదు చేశారని, నాగరాజు ఆచూకీ తెలిసిన వారు సెల్ నెంబర్ 94407 96676కు తెలియజేయాలని కోరారు.

ఇంగ్లిష్ ప్రాముఖ్యతపై అతిథి ఉపన్యాసం

ఏలూరు (టూటౌన్): స్థానిక వట్లూరులోని సీఆర్ఆర్ మహిళా కళాశాలలో బుధవారం ఇంగ్లిష్ లాంగ్వేజ్ డే కార్యక్రమం నిర్వహించారు. నేటి ప్రపంచంలో ఇంగ్లిష్ ఎందుకు ముఖ్యమైనది అనే అంశంపై అతిథి ఉపన్యాసం రిటైర్డ్ ఇంగ్లిష్ లెక్చరర్ బొడ్డపాటి చంద్రశేకర మాధవరావు చేశారు. విలియం షేక్స్‌పియర్ బర్త్, డెత్ యానివర్శరీని పురస్కరించుకుని ఇంగ్లిష్ లాంగ్వేజ్ డేగా నిర్వహిస్తున్నట్లు చెప్పారు. వ్యాపారం, సైన్స్, కమ్యూనికేషన్‌లలో ప్రపంచ భాషగా ఇంగ్లిష్ పరిగణిస్తున్నట్లు తెలిపారు. ప్రపంచ వ్యాప్తంగా 1.5 బిలియన్‌లపైగా ప్రజలు ఇంగ్లిష్‌ను మాట్లాడుతున్నట్టు చెప్పారు. ఇంగ్లిష్ అంతర్జాతీయ సంబంధాలు, దౌత్య, వాణిజ్యానికి అనుబంధ భాషగా మారిందని వివరించారు. కార్యక్రమంలో మహిళా కళాశాల కరస్పాండెంట్ చలసాని విశ్వనాథరావు, ప్రిన్సిపాల్ జి.సరళ, వైస్ ప్రిన్సిపాల్ కె.ఝాన్సీలక్ష్మి పాల్గొన్నారు.


ఇంగ్లీషు లాంగ్వేజ్ డేలో పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

మేడేను ఘనంగా నిర్వహించాలి

ఏలూరు (టూటౌన్): అంతర్జాతీయ కార్మిక దినోత్సవం 139వ మేడే కార్యక్రమాన్ని సీపీఐ శ్రేణులు వాడవాడల పార్టీ పతాకాలను ఆవిష్కరించి, సభలు, సమావేశాలు నిర్వహించాలని సీపీఐ ఏలూరు జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య పిలుపునిచ్చారు. స్థానిక ఆర్ఆర్‌పేటలోని స్ఫూర్తి భవన్‌లో బుధవారం నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. 1886 మే ఒకటో తేదీన చికాగో నగరంలో జరిగిన పోరాట ఫలితంగా ప్రపంచవ్యాప్తంగా ఎనిమిది గంటల పని దినం సాధించుకున్నట్టు చెప్పారు. 2014లో కేంద్రంలో మోదీ నాయకత్వన ఏర్పడిన ఎన్డీఏ ప్రభుత్వం కార్మిక వర్గం సాధించుకున్న 44 చట్టాలను నాలుగు కార్మిక కోడ్లుగా మార్చి కార్మిక హక్కులను కాలరాస్తోందని పేర్కొన్నారు. మళ్లీ దేశంలో 12 గంటల పని దినాన్ని తీసుకురావడానికి మోదీ ప్రభుత్వం ప్రయత్నిస్తోందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ మేడేను కార్మిక హక్కుల పరిరక్షణ దినంగా కార్మిక వర్గం నిర్వహించాలన్నారు.

వీఆర్వోపై చర్యలు తీసుకోవాలి

కొయ్యలగూడెం: తహసీల్దార్ కార్యాలయం పరిధిలోని ఓ వీఆర్వోపై బోడిగూడెం గ్రామ పంచాయతీ పరిధి అంకాలగూడెం గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ సభ్యులు కునపాము రాజారత్నం, సర్పంచ్ గడ్డియ్య, కె.వీరబాబు, పి.శ్రీనివాస్, సీహెచ్ నాగేశ్వరరావు, డి.గణేష్, జె.నాగమణి బుధవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. లంచం లేకుండా వివిధ ధ్రువీకరణ పత్రాలు ఇవ్వడం లేదని పేర్కొన్నారు. దీనిపై గతేడాది కాలంగా తహసీల్దార్, జిల్లా కలెక్టర్, జంగారెడ్డిగూడెం ఆర్డీఓలకు ఫిర్యాదు చేసిన ఫలితంలేదని తెలిపారు. 10 రోజుల్లో తమకు న్యాయం చేయకపోతే నిరాహార దీక్ష చేపడతామని పేర్కొన్నారు.

ఉగ్రదాడిని ఖండించిన ముస్లింల జేఏసీ

జంగారెడ్డిగూడెం: జమ్మూ కాశ్మీర్‌లోని పెహల్గంలో ఉగ్రవాదుల దాడిని జంగారెడ్డిగూడెం ముస్లిం జేఏసీ తీవ్రంగా ఖండించింది. బిలాల్ మస్జిద్లో చనిపోయిన వారికి అల్లా స్వర్గ ప్రాప్తి కలిగించాలని వారికి ప్రగాఢ సానుభూతి తెలియజేస్తూ బుధవారం జంగారెడ్డిగూడెంలో దువా చేశారు. ఈ సందర్భంగా జేసీ నాయకులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం ఉగ్రవాదులపై కఠిన చర్య తీసుకొని వారిని అంతమొందించాలన్నారు. కార్యక్రమంలో షేక్ ముస్తఫా, టిప్ టాప్ బాజీ, షేక్ యాకూబ్, షేక్ ఆదిల్, ఎండి నబి, ఎండీ షాహిన్, షేక్ బాబు సాహెబ్, ఎండీ షఫీ, షేక్ రషీద్, షేక్ ముస్తాక్, షేక్ సుర సాహెబ్, సయ్యద్ సమీవుల్లా తదితరులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

జంగారెడ్డిగూడెం: స్థానిక సబ్‌స్టేషన్‌లో మరమ్మతులు కారణంగా శుక్రవారం జంగారెడ్డిగూడెం డివిజన్ పరిధిలో విద్యుత్ సరఫరా ఉండదని ఈఈ పీర్ అహ్మద్‌ఖాన్ తెలిపారు. ఉదయం 7 నుంచి 11 గంటల వరకు బుట్టాయగూడెం, జీలుగుమిల్లి, కుక్కునూరు, వేలేరుపాడు మండలాలకు, ఉదయం 7 నుంచి 8 గంటల వరకు జంగారెడ్డి గూడెం మండలంలో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

పదో తరగతి ఫలితాల్లో విద్యార్థుల హవా

ఏలూరు (టూటౌన్): పదో తరగతి పరీక్షా ఫలితాల్లో విద్యార్థులు తమసత్తా చాటారు. వీరిని ఆయా స్కూళ్ల యాజమాన్యం, హెచ్ఎంలు, ఉపాధ్యాయులు అభినందించారు. ఆర్ఆర్‌పేట సంతోషీ నగర్‌లోని శ్రీ శర్వాని పబ్లిక్ స్కూల్ టాపర్స్‌గా టి.హాస్యసుమ, యు.తేజశ్రీలు 593/600, జె.భువన పద్మశ్రీ 587 మార్కులు సాధించారని, 15 మంది 500కు పైగా మార్కులు సాధించారని డైరెక్టర్ కె.మదనమోహన్ తెలిపారు. గాంధీనగర్‌లోని న్యూజనరేషన్ హైస్కూలు విద్యార్థి సీహెచ్ సాత్విక్ 537 మార్కులతో పాఠశాల ప్రథమ స్థానం సాధించాడని స్కూల్ కరస్పాండెంట్ ఎన్ఆర్‌కేపీ ప్రసాద్ తెలిపారు. తమ విద్యార్థులు 98 శాతం ఉత్తీర్ణత సాధించారని చెప్పారు.

- శనివారపుపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని ఎస్ లక్ష్మీ పూజ 583, ఎ.నవీన్ 581 మార్కులతో మండల స్థాయిలో ప్రథమ, ద్వితీయ స్థానాలు సాధించారని హెచ్ఎం జి.ప్రకాష్‌రావు, ఉపాధ్యాయుడు కేఎస్‌వీకే రాజ్‌కుమార్ తెలిపారు.
- శాంతినగర్‌లోని గుంటూరు ఆక్స్‌ఫర్డ్ స్కూల్ నుంచి బి.గగనశ్రీ 597 మార్కులతో రాష్ట్ర స్థాయి ర్యాంకు, ఎం నాగసాయి దివ్య 589 మార్కులు సాధించినట్లు రీజినల్ ఇన్‌చార్జి టి.ఉమారాణి తెలిపారు. తమ పాఠశాల నుండి 36 మంది విద్యార్థులు 550కి పైగా మార్కులు సాధించారని చెప్పారు.
- పవరుపేట శ్రీ దీప్తి స్కూలు విద్యార్థులు జి.రాణి 585, ఎం.నాగసరిత 585, గోవింద్ కుమార్ చౌదరి 585 మార్కులు సాధించారని హెచ్ఎం ఎం.రామకృష్ణ తెలిపారు. పాఠశాల నుంచి 58 మంది విద్యార్థుల్లో 18 మంది 550కు పైగా, 34 మంది 500కు పైగా మార్కులు సాధించారని వివరించారు.

మండలంలో 82 శాతం ఉత్తీర్ణత

పది పరీక్షా ఫలితాల్లో ఏలూరు మండలంలో మొత్తం 82 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎంఈఓ డీవీ రమణ తెలిపారు. మొత్తం 41 ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో 4,510 మంది పరీక్షలు రాయగా, 3,684 మంది ఉత్తీర్ణులయ్యారని వివరించారు. వీరిలో బాలురు 1828 మంది, బాలికలు 1856 మంది ఉత్తీర్ణులైనట్టు చెప్పారు. మండలంలో సుంకర లక్ష్మీపూజ 583, అడ్డగర్ల నవీన్ 581, కొతవరపు హేమాంజలి 563 మార్కులు సాధించి ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారని వివరించారు.


ఏలూరు మండలం ఫస్ట్ సాధించిన విద్యార్థినిని అభినందిస్తున్న శనివారపుపేట హెచ్ఎం


టి.హాస్యసుమ,593


యు.తేజశ్రీ, 593


బి.గగనశ్రీ, 597


యం.నాగసాయి దివ్య, 589

మే 10న మెగా లోక్ అదాలత్

చింతలపూడి : స్థానిక జూనియర్ సివిల్ కోర్టులో మే 10వ తేదీన నిర్వహించే మెగా లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలని జూనియర్ సివిల్ జడ్జి సీహెచ్ మధుబాబు కోరారు. బుధవారం స్థానిక కోర్టు ఆవరణలో పోలీసు, ఎక్సైజ్ అధికారులతో లోక్ అదాలత్‌పై ఆయన సమీక్షించారు. ఈ లోక్ అదాలత్‌లో క్రిమినల్, సివిల్, బ్యాంక్ రికవరీ, చెక్ బౌన్స్, బీఎస్ఎన్ఎల్ రికవరీ, కుటుంబ తగాదా, మనోవర్తి, ప్రామిసరీ నోట్ కేసులు పరిష్కారం చేసుకోవచ్చని చెప్పారు. కేసులు రాజీకి నిత్యం కోర్టులో ప్రీలోక్ అదాలత్ సిట్టింగ్‌లు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. కేసులు రాజీ ద్వారా సమయం, డబ్బు ఆదా అవుతుందన్నారు. పూర్తి వివరాలకు దగ్గరలో ఉన్న పోలీస్ స్టేషన్, కోర్టులో సిబ్బందిని సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు. సీఐ సీహెచ్ రాజశేఖర్, ఎక్సైజ్ సీఐ పి.అశోక్, చింతలపూడి, టి.నర్సాపురం, ధర్మాజీగూడెం, తడికలపూడి, ఎస్సైలు, కోర్ట్ కానిస్టేబుళ్లు పాల్గొన్నారు.

మహిళా భద్రతకు ప్రాధాన్యత

ఏలూరు టౌన్: మహిళల భద్రతకు అత్యధిక ప్రాధాన్య త ఇస్తున్నామని, ముందుగా మహిళలు, విద్యార్థినులు ఆపద సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పిస్తున్నామని డీఎస్పీ డి.శ్రావణ కుమార్ తెలిపారు. ఏలూరులోని బీఎస్సీ నర్సింగ్ విద్యార్థినులకు శక్తి యాప్, టోల్‌ఫ్రీ నెంబర్స్‌పై వన్‌టౌన్ సీఐ జి.సత్యనారాయణ, టూటౌన్ సీఐ కె.అశోక్‌కుమార్, మహిళా స్టేషన్ సీఐ ఎం సుబ్బారావు, శక్తి టీమ్‌తో కలిసి బుధవారం డీఎస్పీ అవగాహన కల్పించారు. మహిళలు, బాలికలు, విద్యార్థినుల రక్షణకు శక్తి యాప్‌ను ప్రభుత్వం ఏర్పాటు చేసిందన్నారు. మహిళా చట్టాలపైనా అవగాహన కలిగి ఉండాలని, అత్యసర సమయాల్లో డయల్ 112, సైబర్ మోసాలపై ఫిర్యాదులకు 1930, బాలల హెల్ప్‌లైన్ 1098, వంటి టోల్‌ఫ్రీ నెంబర్లకు ఫోన్ చేస్తే వెంటనే పోలీస్ సిబ్బంది ఘటనా స్థలాలకు చేరుకుని రక్షణ కల్పిస్తారని వివరించారు. భవిష్యత్తులో ఏలూరు నగరంతోపాలు జిల్లాలోని పట్టణ, మండల కేంద్రాల్లోనూ విద్యార్థినులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తామన్నారు. శక్తి యాప్ సెల్‌ఫోన్‌లో ఉంటే ఆపద సమయంలో 10 నిమిషాల్లోనే బాధితులకు అండగా పోలీస్ సిబ్బంది ఉంటారని డీఎస్పీ భరోసా కల్పించారు.


శక్తి యాప్‌పై అవగాహన కల్పిస్తున్న డీఎస్పీ శ్రావణ్‌కుమార్

మాజీ హోం మంత్రి వనిత పరామర్శలు

ద్వారకాతిరుమల: మండలంలో ఇటీవల మృతి చెందిన పలువురు వైఎస్సార్ సీపీ కార్యకర్తల కుటుంబాలను మాజీ హోం మంత్రి, గోపాలపురం నియోజక వర్గ పార్టీ ఇన్‌చార్జి తానేటి వనిత బుధవారం పరామర్శించారు. తిరుమలంపాలెంలో సర్పంచ్ పల్లి నిర్మల ప్రసాద్ తండ్రి అబ్రహాం, సూర్యచంద్రరావుపేటలో చింతపల్లి వీరాంజనేయులు తండ్రి, మలసానికుంటలో కొండేపూడి గంగరాజు, దొరసానిపాడులో పోలుబోయిన సురేష్, అలాగే మట్టా వెంకట్రావు తండ్రి, కొమ్మరలో కేవీఆర్ తండ్రి, కోడిగుడెంలో రాజులపాటి మంగారావు ఇటీవల మృతి చెందారు. వనిత బాధిత కుటుంబాల ఇళ్లకు వెళ్లి, వారిని పరామర్శించి, తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు. మృతుల చిత్రపటాలకు పూల మాలలు వేసి నివాళులర్పించారు. తిరుమలంపాలెంలో అనారోగ్యంతో బాధపడుతున్న అద్దంకి లక్ష్మణరావును పరామర్శించారు. కార్యక్రమంలో నాయకులు ప్రతాపనేని వాసు, పోల్కంపల్లి అనీల్, పెద్దిరెడ్డి జ్యోతి శ్రీనివాస్, బొండాడ వెంకన్నబాబు, చెలికాని బుల్లియ్య, దాసరి రాంబాబు, మల్లెపూడి నాగమణి, భోగరాజు సాయికృష్ణ, గుర్రాల లక్ష్మణ్, పాకలపాటి త్యాగ భీమేశ్వరరావు, షేక్ మస్తాన్ భాషా, దాకారపు అగ్గియ్య, దొప్పసాని రాంబాబు, లక్కాబత్తుల సిద్ధిరాజు తదితరులున్నారు.


సురేష్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వనిత

పంచాయతీరాజ్ ఎంప్లాయిాస్ అధ్యక్షుడిగా కాకరపర్తి

కొయ్యలగూడెం: ఆంధ్రప్రదేశ్ రాజ్ పంచాయతీ రాజ్ మినిస్టీరియల్ ఎంప్లాయీస్ అసోసియేషన్ (జంగారెడ్డిగూడెం యూనిట్) అధ్యక్షుడిగా కొయ్యలగూడెం మండల పరిషత్ కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ కాకరపర్తి స్వామి ఎంపికైనట్టు ఎన్నికల అధికారులుగా వ్యవహరించిన కె.యోహన్, రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు, ఎన్నికల పరిశీలకుడిగా సీహెచ్ గోపాలకృష్ణ బుధవారం ప్రకటించారు. ఉపాధ్యక్షులుగా కె.మంగతాయారు, ప్రధాన కార్యదర్శిగా వి.ప్రసాద్, సభ్యులు ఎన్నికయ్యారని తెలిపారు.

కమనీయం.. శ్రీనివాస కల్యాణం


కల్యాణ మూర్తులకు హారతులిస్తున్న అర్చకులు

ద్వారకాతిరుమల: శ్రీవారి దత్తత ఆలయమైన లక్ష్మీపురం శ్రీ సంతాన వేణుగోపాల జగన్నాథ వెంకటేశ్వర స్వామి ఆలయంలో బుధవారం రాత్రి శ్రీనివాసుని దివ్యకల్యాణ మహోత్సవాన్ని అంగరంగ వైభవంగా నిర్వహించారు. మేళతాళాలు, మంగళ వాయిద్యాలు, అర్చకులు, పండితులు, ఆగమ విద్యార్థుల వేద మంత్రోచ్ఛరణల నడుమ జరిగిన ఈ కల్యాణ తంతు భక్తులకు నేత్రపర్వమైంది. దేవస్థానం తరపున స్వామివారికి ఆలయ ఈఓ ఎన్‌వీ సత్యనారాయణ మూర్తి, ప్రభుత్వం తరపున అమ్మవార్లకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు పట్టు వస్త్రాలను సమర్పించారు. అర్చకులు, పండితులు స్వామి, అమ్మవార్లకు నీరాజనాలు సమర్పించి కల్యాణ తంతును ప్రారంభించారు. సుముహూర్త సమయంలో నూతన వధువరుల శిరస్సులపై జీలకర్ర, బెల్లం ధరింపజేసి, మాంగల్యధారణ, తలంబ్రాల వేడుకలను భక్తులు నిర్వహించారు.

కూరగాయల ధరలు

ఏలూరు నగరంలోని రైతు బజార్లలో కూరగాయల ధరలు

కూరగాయలు	కిలో ధర	కూరగాయలు	కిలో ధర
టమాటాలు	20	అరటి కాయ (1)	06-08
వంకాయలు (గులాబీ)	20	చిక్కుడు కాయలు	76
వంకాయలు (కాంతులు)	24	బీన్లచిక్కుడు	84
వంకాయలు (తెలుపు)	28	చామదుంపలు	54
బెండకాయలు	24	ములక్కాడలు	08, 10
పచ్చిమిర్చి	36	కంద	76
కాకర కాయలు	30	బీట్‌రూట్	30
బీరకాయలు	30	కీరా దోస	36
బీరకాయలు (పందిరి)	36	ఫ్రెంచ్‌బీన్స్	70
క్యాబేజీ	20	అల్లం	60
క్యారెట్	30	కొత్తిమీర (కట్ట)	25
దొండకాయలు	20	పాలకూర	12
బంగాళదుంపలు	32	తోటకూర	10
ఉల్లిపాయలు	24	చుక్కకూర	12
గోరుచిక్కుడు	36	గోంగూర	07-10
దోసకాయలు	20	పుదీనా	05
ఆనబకాయ (1)	20	క్యాప్సికమ్	60
పొట్లకాయ(1)	20-25	చిలకడదుంప	40

ఆర్టీసీ సమాచారం

ఏలూరు ఆర్టీసీ డిపో నుంచి దూరప్రాంతాలకు వెళ్లే బస్సుల సమయాలు, రిజర్వేషన్ వివరాలు

ఏసీ బస్సులు..

బస్సు రూటు	సమయం	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (ఇంద్ర)	21.00	27
ఏలూరు - జీడిమెట్ల (ఈసీఐఎల్) (ఇంద్ర)	21.30	31
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ (అమరావతి)	22.00	42
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ (స్టార్ లైనర్ నాన్ఏసీ స్లీపర్)	22.30	14
ఏలూరు - తిరుపతి (ఇంద్ర)	19.00	రద్దు

సూపర్ లగ్జరీ

బస్సు రూటు	సమయం	సర్వీస్ నంబర్	అందుబాటులో ఉన్న సీట్లు
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.45	4820	23
ఏలూరు -బీహెచ్‌ఈఎల్	21.15	4822	29
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా కే.కోట	19.30	4796	18
ఏలూరు -బీహెచ్‌ఈఎల్ వయా రామచంద్రపురం	19.45	4798	25
ఏలూరు - బీహెచ్‌ఈఎల్ వయా ఖమ్మం	21.00	4804	27
ఏలూరు -ఈసీఐఎల్	22.30	4814	28
ఏలూరు - తిరుపతి	16.00	4830	34